క్లుప్తంగా

అంధకారంలో జీజీహెచ్



మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అంధకారం నెలకొంది. పట్టణంలో కురిసిన భారీ వర్షానికి బుధవారం వరద నీరు ఆసుపత్రిలోని పలు వార్డుల్లో చేరగా, విద్యుత్ సమస్య నెలకొంది. దీంతో గురువారం విద్యుత్ సమస్యను పరిష్కరించకపోవడంతో, పలు వార్డుల్లో అంధకారం నెలకొంది. ఆసుపత్రిలోని రోగులు విద్యుత్ లేక అవస్థలు పడుతుండగా, జనరేటర్ సక్రమంగా పనిచేయక పోవడం వల్ల కరెంటు కష్టాలు తప్పడం లేదు. ఆసుపత్రికి రెండు భవనాలు ఉండగా, ఒక భవనంలో మాత్రమే ప్రస్తుతం విద్యుత్ ఉండగా, పాత భవనంలో విద్యుత్ సమస్య ఉత్పన్నం అవుతోంది.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ 10వార్డు పరిధి పెద్దనపల్లి శివారు ప్రాంతంలో ఓ గేదె విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. బాధితుడు జక్కుల రాజ మహేందర్ కథనం ప్రకారం.. పెద్దపపల్లి శివారు ప్రాంతంలో ఉన్న ఓ పొలం వద్దకు గేదె మేతకు వెళ్లింది. మేత మేస్తున్న క్రమంలో పక్కన ఉన్న కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి గేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపాడు. మృతి చెందిన గేదే విలువ రూ.60వేల వరకు ఉంటుందని తెలిపాడు. డిస్కం అధికారులు పరిహారం ఇప్పించాలని ఆయన వేడుకున్నాడు.

సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నస్పూర్: గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు, ఉద్యోగులు జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు.

రోడ్డుపై వరినాటు వేసి నిరసన



మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లు గుంతలుగా మారుతున్నాయని, చిన్నపాటి వర్షానికే వరద నీటితో నిండిపోతున్నాయంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం వినూత్న నిరసన వ్యక్తం చేశారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో హైటెక్‌సిటీ కాలనీలోని రోడ్లపై ఉన్న గుంతల్లోని వరద నీటిలో వరినాట్లు నాటి నిరసన వ్యక్తం చేశారు.

సీపీఐ బెల్లంపల్లి కార్యదర్శిగా రాజమౌళి

బెల్లంపల్లి: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి, సహాయ కార్యదర్శులను ఎన్నుకున్నారు. సీపీఐ కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించి కొత్తగా నియామకమైన కమిటీ సభ్యుల వివరాలను సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ప్రకటించారు. పట్టణ సీపీఐ కార్యదర్శిగా ఆడేపు రాజమౌళి, సహాయ కార్యదర్శులుగా బియ్యాల ఉపేందర్, కొంకుల రాజేష్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక

లక్సెట్టిపేట: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన పలువురు కార్యకర్తలు మాజీ ఎమ్మెల్సీ కొక్కొరాల ప్రేంసాగర్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు.

పునరావాస కేంద్రానికి తరలింపు



చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలో గల శిథిలావస్థకు చేరిన గృహాల్లో నివసిస్తున్న నాలుగు కుటుంబాలకు చెందిన 16మందిని పునరావాస కేంద్రానికి తరలించినట్లు సీఐ వాసుదేవరావు, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే తెలిపారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా స్థానిక సాయిరాం ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రెవెల్లి మహేశ్, నసీమాబేగం, అనిల్, నాయిని శ్యామల, అధికారులు రాజ్‌కుమార్, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లో వరద ప్రభావిత ప్రాంతాలను మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు పర్యటించారు. జాన్సీనగర్, భగత్‌సింగ్‌నగర్, అరుణక్కనగర్ తదితర కాలనీల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ కాలనీల్లో వరద నీరు వచ్చి ఇళ్లలో చేరింది. ఇంటింటికీ ఎమ్మెల్యే వెళ్లి ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. కాలువలు నిండి మురికి నీరు, వరద నీరు రోడ్లపైకి, ఇళ్లలోకి చేరిందని వారు వాపోయారు. చెత్తపేరుకుపోయి మూసుకుపోయిన కాలువలను వెంటనే శుభ్రం చేయాలని ఎమ్మెల్యే సంబంధిత మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రజలతో మాట్లాడి వారికి జరిగిన నష్టం గురించి తెలుసుకున్నారు. యుద్ధ ప్రాతిపాధకన సానిటేషన్ చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వార్డు సభ్యులు సిడాం మహేశ్, పూదరి కుమార్, మాజీ సర్పంచ్ మల్లెత్తుల రాజేంద్ర పాణి, టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సంతోశ్‌చారీ, శ్రీరాంపూర్ ఎస్సై రాజేశ్‌లు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నస్పూర్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. వినూత్నకాలనీలో ఎమ్మెల్యే దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, కమిషనర్ రమేశ్, స్థానిక తహసీల్దార్ జ్యోతి, స్థానిక ఎస్సై రవికుమార్ వేరువేరుగా పర్యటించారు. స్థానికుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. కడెం ప్రాజెక్టు నుంచి విడుదల అవుతున్న నీటితో గోదావరి ప్రమాద కర స్థాయిలో ప్రవహిస్తున్నదని ముందస్తు చర్యలలో భాగంగా కాలనీ వాసులు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. పట్టణ ప్రజల సౌకర్యార్థం పునారవాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. 24గంటలు మున్సిపల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా పోలీసు శాఖ వారి ఆధ్వర్యంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిట్టల ప్రభాకర్ 99492 19646, ఓ రమేశ్ 93984 93181, ప్రవీణ్ 8500258180నంబర్లలో సంప్రదించాలని సూచించారు. పట్టణంలోని శ్రీరాంపూర్ ఝాన్సీనగర్, నస్పూర్‌లోని అల్లూరి సీతారామరాజు నగర్‌లలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పర్యటించారు. కాలనీ వాసుల ఇబ్బందులను అడిగి తెలిసుకున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



శ్రీరాంపూర్‌లోని బుడిగ జంగాల కాలనీ వద్ద వరదకు కాలువ మూసుకుపోవడంతో శ్రీరాంపూర్ సీఐ రమేశ్‌బాబు, ఎస్సై రాజేశ్‌లు దగ్గరుండి జేసీబీలతో పూడిక తీయించి వరద నీటిని కిందికి పంపారు.

వరద బాధితులకు అండగా ఉంటాం

మంచిర్యాలటౌన్: వరద బాధితులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు అండగా ఉంటారని, ఎలాంటి సాయం అందించేందుకైనా తమ కార్యకర్తలు, తాను వస్తానని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీలోని లోతట్టు ప్రాంత ప్రజలను గురువారం కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరద ముప్పు పొంచి ఉన్నందున సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అన్నారు. ఇతర ఏవైనా సహాయ సహకారాలకు తమను సంప్రదించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోశ్ ఎన్టీఆర్ నగర్‌ను పరిశీలించేందుకు రాగా, ప్రజలకు ప్రభుత్వపరంగా సాయం అందించేలా చూడాలని కోరారు.



ప్రజలతో మాట్లాడుతున్న కొక్కిరాల సురేఖ

ప్రజలు అధైర్య పడొద్దు



రాళ్లవాగును పరిశీలిస్తున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: రాళ్లవాగు ఉధృతంగా ప్రవహిస్తుందని, లోతట్టు ప్రాంత ప్రజలు అధైర్య పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. ఎన్టీఆర్ నగర్‌లోని ఇళ్లను ఆనుకుని ప్రవహిస్తున్న రాళ్లవాగును గురువారం ఆయన పరిశీలించి, లోతట్టు ప్రాంత ప్రజలకు మనోధైర్యం అందించారు.

వదలని వాన

కోటపల్లిలో కూలిన ఇల్లు



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై

కోటపల్లి: వర్షాలకు మండలంలోని దేవులవాడ గ్రామానికి చెందిన అసరెల్లి మొండక్క ఇల్లు కూలిపోగా గురువారం ఎస్సై సురేశ్, నాయకులు విద్యాసాగర్ పరిశీలించి బాల్కఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.3వేల ఆర్థిక సాయం అందజేశారు.

లక్సెట్టిపేటలో ప్రహరీ



లక్సెట్టిపేట: వర్షాలకు కొమ్ముగూడెం గ్రామ చెరువు నిండి మత్తడి పారుతుండడంతో తహసీల్దార్ జ్యోత్స్న పరిశీలించారు. చెరువు సమీపంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్థానిక బాలికల వసతి గృహంలో ప్రహరీ కూలిపోవడంతో డీఈ శ్రీనివాస్, ఎస్‌డబ్ల్యూవో రవీందర్ పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉంటే 76809 44326 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కూలిన ఇంటి గోడ



శ్రీరాంపూర్: వర్షానికి బుధవారం రాత్రి శ్రీరాంపూర్‌లోని అరుణక్కనగర్‌లో నివాసం ఉంటున్న రాజమ్మకు చెందిన ఇంటి గోడ కూలింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సామగ్రి ధ్వంసమయ్యాయి. ఆ ఇంటిని ఎమ్మెల్యే దివాకర్‌రావు గురువారం పరిశీలించారు.



దండేపల్లి: భారీ వర్షాలతో కడెం, ఎస్సారెస్పీ ప్రాజెక్టుల వరద నీటిని గోదావరిలోకి వదలడంతో, దండేపల్లి మండలంలోని ద్వారక, గూడెం వద్ద గురువారం గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. వర్షంతో మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. గూడెంలో పలు ఇళ్లలో వర్షం నీళ్లు వచ్చి చేరడంతో, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పత్తి చేళల్లో వర్షం నీళ్లు నిలిచాయి. మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు 131.2 మి.మీటర్ల వర్షపాతం నమోదయ్యింది.



గూడెంలో రోడ్డుపై నిలిచిన వర్షం నీళ్లు

వరద ముంపు గ్రామాలను ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, తహసీల్దార్ హన్మంతరావు, ఎస్సై ప్రసాద్ పర్యటించారు. ముంపు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



గోదావరి ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్

నస్పూర్ చెరువుకు మరమ్మతు

నస్పూర్: పట్టణంలోని ఊర చెరువులోకి భారీగా వరద నీరు చేరింది. దీంతో సీతారాంపల్లి గ్రామం వైపు మత్తడి వద్ద చెరువుకు గండి పడే ప్రమాదం ఏర్పడింది. స్థానికుల సమాచారం మేరకు స్థానిక తహసీల్దార్ జ్యోతి, ఆర్ఐ మాంతయ్య సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ, స్థానికుల సాయంతో చెరువుకు పడిన గుంతను, మట్టి నింపిన సంచులతో పూడ్చివేశారు.



గండి పూడ్చివేత



చెన్నూర్‌రూరల్: ఎర్రగుంటపల్లి సమీపంలోని గొల్లవాగు ప్రాజెక్టు కాలువకు పడ్డ గండిని గురువారం సంబంధిత అధికారులు పూడ్చి వేయించారు. ప్రాజెక్టు ఏఈ శశాంక్, ఇన్‌స్పెక్టర్ కుమార్, కాలువ లైన్‌మెన్ తిరుపతి జేసీబీతో గండిని పూడ్చి వేయించి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చేశారు.

బాదంపల్లి రోడ్డుకు మరమ్మతు

జన్నారం: భారీవర్షం కారణంగా జన్నారం నుంచి బాదంపల్లి గ్రామానికి వెళ్లే దారిలో ఒర్రె ఉధృతంగా ప్రవహించి, బీటీ రోడ్డు కోతకు గురైంది. బీటీ రోడ్డు కింద నుంచి నీరు పారడంతో రోడ్డు తెగిపోయే పరిస్థితికి చేరింది. దీంతో బాదంపల్లి, పొనకల్ గ్రామస్తులు గండి పూడ్చడానికి ప్రయత్నం చేశారు. పొనకల్ సర్పంచ్ ఆధ్వర్యంలో యువకులు, గ్రామస్తులు ఇసుక బస్తాలు వేసి గండిని పూడ్చారు.



'గోదావరి' ఉగ్రరూపం



చెన్నూర్: చెన్నూర్ గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. కడెం ప్రాజెక్ట్ 14గేట్లు ఎత్తడంతో పాటు ఎగువ కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరినదిలో ప్రవాహం పెరగడంతో పుష్కరఘాట్లు మునిగిపోయాయి. గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న పంట చేన్లు నీట మునిగాయి. భారీ వర్షాలకు వాగులు, నదులు, కాలువలు, ఉధృతంగా ప్రవహిస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ వాసుదేవరావు తెలిపారు.

అన్నారం బ్యారేజీకి వరద

చెన్నూర్‌రూరల్: నాలుగు రోజులుగా స్థానికంగా, ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు మండలంలోని సుందరసాల, నర్సక్కపేట గ్రామాల సమీపంలోని అన్నారం బ్యారేజీకి వరద నీరు పోటెత్తింది. వాగులు ఉప్పొంగాయి. దీంతో బ్యాక్ వాటర్ గ్రామ సమీపంలోకి వస్తుంది. సుందరసాల గ్రామం నుంచి అన్నారం బ్యారేజీకి వెళ్లే దారిలో వరద నీరు నిలిచింది. పంట పొలాల్లో వరద నీరు చేరింది. అక్కెపల్లి గ్రామానికి వెళ్లే దారిలోని వాగు లోలెవల్ కాజ్‌వై పై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచాయి.

రాకపోకలు బంద్



తాండూర్:మండలంలోని రైల్వే అండర్ బ్రిడ్జిలో వరదనీరు చేరి నిండుగా ఉండటంతో రాకపోకలు నిలిచాయి. రైల్వే అధికారులు ముందు జాగ్రత్తగా రోడ్డును మూసి వేశారు. రేచినీ రోడ్ రైల్వేస్టేషన్ సమీపంలో కాజ్‌వే పై నుంచి వరద నీరు మోకాలి లోతు నుంచి ప్రవహిస్తుండటంతో ప్రయాణికులు భయంభయంగా రోడ్డు దాటుతున్నారు. పంట పొలాలు నీట మునిగాయి.

'డబుల్' ఇళ్లు మంజూరు చేయాలి

బెల్లంపల్లి: ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరవెల్లి రఘునాథ్, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు కోడి రమేష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బీజేపీ ఆధ్వర్యంలో గురువారం బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. మున్సిపాలిటీలో నివసిస్తున్న పేదలు భారీగా తరలివచ్చి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చి, సీఎం కేసీఆర్ మోసం చేశారని విమర్శించారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను త్వరగా పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయకపోతే శ్రావణ మాసంలో బీజేపీ పేదలకు సామూహికంగా అందజేస్తుందని ప్రకటించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, నాయకులు విజయ్, రాజశేఖర్, రాంచందర్, శ్రీనివాస్, రాజేష్, నాగరాజ్, రాజనర్సు, రాజలింగు, కళ్యాణి, కమల, అజయ్, యుగంధర్, పేదలు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా





వరదనీటిలో చేపల వేట

జిల్లాలో భారీగా కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు, వాగుల్లో వరదనీరు వచ్చి చేరుతోంది. వరద నీటిలో చేపలు వస్తుండడంతో గురువారం చేపలు పట్టేందుకు స్థానికులు ఉత్సాహం చూపారు.

- మంచిర్యాల టౌన్/బెల్లంపల్లి

కార్మిక కాలనీల్లో జీఎం పర్యటన



■ బొగ్గుబాయి వార్తలు

మందమర్రిరూరల్: ఏరియాలోని పలు కాలనీల్లో ఏరియా జీఎం మోహన్‌రెడ్డి, యూనియన్ ప్రతినిధులు, అధికారులతో కలిసి గురువారం పర్యటించారు. కాలనీల్లోని ప్రజలు డ్రెయినేజీలు సరిగ్గాలేవని, తాగునీరు రావడం లేదని, మురికి నీళ్లు వస్తున్నట్లు వాపోయారు. వెంటనే జీఎం సంబంధిత అధికారులతో కార్మిక వాడల్లోని సమస్యలు తీర్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వ్యక్తిగత భద్రతపై అవగాహన

శ్రీరాంపూర్: ఏరియాలోని ఆర్కే న్యూటెక్ గనిపై ఉద్యోగుల వ్యక్తిగత భద్రతపై సేఫ్టీ అధికారులు అవగాహన కల్పించారు. గనిపై గురువారం జరిగిన కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ జీఎం సేఫ్టీ గుప్తా పాల్గొని మాట్లాడారు. రక్షణసూత్రాలు పాటిస్తూ పని చేయాలన్నారు. గనుల్లో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏజెంట్ మాలోత్ రాముడు, గ్రూప్ ఇంజనీర్ రవిచరణ్, మేనేజర్ స్వామిరాజు, రక్షణాధికారి కొట్టె రమేశ్, ఫిట్ సెక్రెటరీ జంపయ్యలు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిపై గురువారం కోవిడ్‌తో మృతిచెందిన పిల్లి భూషణం భార్య పద్మకు గ్రూప్ ఏజెంట్ రాందాస్, గని మేనేజర్ అల్లావుద్దీన్ చేతుల మీదుగా రూ.15లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సంక్షేమాధికారి మీర్జా గౌస్, ఇంజనీర్ బాబు, మధుకర్, బన్న లక్ష్మణ్‌దాస్, టీబీజీకేఎస్ ఏరియా కార్యదర్శి ఓడ్నాల రాజన్న, ఫిట్ సెక్రెటరి భైరి శంకర్, ఏఐటీయూసీ అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరి వర్ధమల్ల రాజేందర్, రాగులు, సతీష్ తదితరులున్నారు.

'వేధింపులు మానుకోవాలి'

శ్రీరాంపూర్: సమస్యలను లేవనెత్తిన కార్మికులపై అధికారులు, గుర్తింపు సంఘం నాయకులు వేధింపులు చేయడం మానుకోవాలని హెచ్‌ఎమ్మెస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఆర్కే 5గని పై గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కార్మికుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే, ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. సింగరేణి కార్మికుల పక్షాన పోరాడే ఏకైక సంఘం హెచ్‌ఎమ్మెస్ మాత్రమేనని తెలిపారు. కార్యక్రమంలో ఆ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్ రెడ్డి, నాయకులు గొల్ల సత్యనారాయణ, సందీప్, క్రాంతి నామాల శ్రీను, మందమరి ఏరియా ఉపాధ్యక్షుడు జీవన్ జోయల్ పాల్గొన్నారు.

'పెన్షనర్లు పత్రాలు సమర్పించాలి'

శ్రీరాంపూర్: సింగరేణిలో పెన్షన్ తీసుకునే రిటైర్డ్ ఉద్యోగులు కంపెనీ పేర్కొన్న నిర్ణీత పత్రాలను వెంటనే సమర్పించాల్సిందిగా శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్) అరవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థుల్లో దేశ సమైక్యత, సమగ్రత పెంపునకు కృషి

మంచిర్యాలఅర్బన్: కేంద్రీయ విద్యాలయాల్లో ప్రస్తుతం బాలవాటిక నుంచి 12వ తరగతికి వరకు 13సంవత్సరాలు నాణ్యమైన విద్యనందిస్తూ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతూ దేశ సమైక్యత, సమగ్రత పెంపునకు కృషి చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ శోభన్‌బాబు తెలిపారు. మంచిర్యాల కేంద్రీయ విద్యాలయంలో గురువారం నూతన విద్యావిధానం 2020 ప్రవేశపెట్టి మూడు సంవత్సరాలు పూర్తైనా సందర్భంగా వేడుకలు నిర్వహించారు.

'కూరగాయల వ్యాపారులకు సౌకర్యాలు కరువు'

మందమర్రిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని పాలచెట్టు సమీపంలోని కేకే-5 గని రోడ్డు పక్కన కూరగాయల వ్యాపారస్తులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు రామిల్ల రాధిక మండిపడ్డారు. గురువారం కూరగాయలు అమ్ముకునే వారి దగ్గరకు వెళ్లి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు.